
సాక్షి ఒడిశా

బుధవారం । 9 । అక్టోబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 3,35,997
బంగారం	1 గ్రాము 400 మిల్లీ గ్రాములు
వెండి	5 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

-భువనేశ్వర్/పూరీ



ఆదివాసీల ఆందోళన

ఆదివాసీలు ఆందోళన బాటపట్టారు. అటవీ భూములు, పట్టాలు మంజూరు చేయాలంటూ ధర్నా చేపట్టారు.

- IIలో



ముగిసిన సంపూర్ణ అభిజాన్

రాయగడ జిల్లాలో జూలైలో ప్రారంభమైన సంపూర్ణ అభిజాన్ చైతన్య కార్యక్రమం మంగళవారంతో ముగిసింది.

- IIలో

అద్భుతం.. అపురూపం

- దసరా ఉత్సవాల్లో ఆకట్టుకుంటున్న పెండాల్స్
- పోటాపోటీగా మండపాలు రూపొందించిన నిర్వాహకులు
- వివిధ అలంకరణల్లో పూజలందుకుంటున్న అమ్మవారు



రాయగడ: కస్తూరినగర్‌లో లక్ష్మీ అవతారంలో అమ్మవారు



రాయగడ: రాణిగుడ ఫారంలో గాజులతో అర్చనలు



కొరాపుట్: అద్భుతమైన కళా నైపుణ్యం



కొరాపుట్: పపడాహండిలో అయోధ్య తరహాలో దసరా పెండాల్

రాయగడ/కొరాపుట్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవార్ల అలంకరణలు ఒక ప్రత్యేకత కాగా.. దుర్గాదేవి కొలువుదీరే పెండాల్(మండపం సెట్) మరో ప్రత్యేక ఆకర్షణ. ఖరీదైన సినిమా సెట్టింగులకు తీసిపోని విధంగా అచ్చం నిజమైన కట్టడాలను తలపించేలా పలుచోట్ల మండపాలు రూపొందించారు. ముఖ్యంగా రాయగడ, నబరంగపూర్ జిల్లాల్లో ఏర్పాటు చేసిన పెండాల్స్ చూపుతిప్పుకోలేనంత అద్భుతంగా సిద్ధం చేశారు. రాయగడలోని బ్రాహ్మణ వీధిలో ఏర్పాటు చేసిన పెండాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రాయగడ సమీపంలోని జేకేపూర్‌లో పేపర్ మిల్లు యాజమాన్యం నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో తిరుపతి వెంకన్న మందిరం తరహాలో ముఖద్వారం ఏర్పాటు చేయడంతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి కేంద్రంలోని మెయిన్ సెంటర్‌లో ఉమ్మర్‌కోట్ రోడ్డులో అయోధ్య రామ మందిరం తరహాలో దసరా పెండాల్ నిర్మించారు. కోల్‌కతాకు చెందిన సుమారు 25 మంది కళాకారులు సుమారు 3 నెలలు కష్టపడి దీనిని ఏర్పాటు చేశారు. అయోధ్య రామ మందిరం తరహా శిల్పాలు ఇందులో ఏర్పాటు చేయడం విశేషం. సెట్ రూపొందించిన వారికి రూ.40 లక్షలు చెల్లించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సుమారు 18 ఏళ్లగా పపడాహండి దసరా ఉత్సవాలు అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అవిభక్త కొరాపుట్ జిల్లాల నుండి సుమారు 10 లక్షల మంది సందర్శకులు ఈ పెండాల్ తిలకించడానికి వస్తారని అంచనా. అందుకు తగ్గ విధంగా పోలీసులు భద్రతా, ట్రాఫిక్ విభాగాలపై దృష్టి సారించారు.

మహాలక్ష్మిగా అమ్మవారు..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం మహాలక్ష్మీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాయగడలోని కస్తూరినగర్‌లోని సత్యనారాయణ మందిరంలో మహాలక్ష్మి అమ్మవారి చేతిలో కరెన్సీ నోట్లు జాలు వారేలా ఏర్పాటు చేయడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వీక్షిస్తున్నారు. ఆలయ ప్రధానార్చకులు మావుదూరు కిశోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక హాతీపథర్ రోడ్డులో ఏర్పాటు చేసిన అమ్మవారికి ఏడువర్ణాల పూలు, నాణేలతో ప్రత్యేక పూజలు చేశారు. రాణిగుడఫారంలోని దుర్గా మండపంలో అమ్మవారిని 3108 గాజులతో అలంకరించారు.



రాయగడ: హాతీపథర్ రోడ్డులో ఏడువర్ణాల పూలతో పూజలందుకున్న అమ్మవారు



రాయగడ: జేకేపూర్‌లో వెంకన్న గుడి ఆకృతిలో..



కొరాపుట్: పెండాల్ లోపల రాజమహల్ సెట్



రాయగడ: బ్రాహ్మణ వీధిలో ప్రత్యేక ఆకర్షణగా సెట్

న్యూస్‌రీల్

రాజమాతకు ఆహ్వానం



కనకదుర్గకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

జయపురం: ఈ నెల 12న దసరా పాడియలో జరగనున్న దసరా వేడుకలకు జయపురం రాజమాత సారికా దేవిని జయపురం ఎమ్మెల్యే, దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తారాప్రసాద్ బాహిణీపతి ఆహ్వానించారు. మంగళవారం రాజకోటకు ముందుగా రాజుల కులదేవత కనకదుర్గాదేవి ప్రత్యేక పూజలు చేశారు.

విజిలెన్స్ దాడులు



రమేష్ చంద్ర జెనా

భువనేశ్వర్: అక్రమాస్తుల ఆరోపణ కింద రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్, తాగునీరు విభాగం సీనియర్ ప్రైవేటు కార్యదర్శి (గ్రేడ్- ఎ) రమేష్ చంద్ర జెనా ఇంటిపై విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు చేపట్టారు. పూరీ, ఖుర్దా జిల్లాల్లో ఒకేసారి 8 వేర్వేరు చోట్ల సోదాలు చేశారు. 8 మంది డీఎస్పీలు, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, 10 మంది అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, అనుబంధ సిబ్బంది కలిసి దాడులు చేపట్టారు. స్థానిక విజిలెన్స్ ప్రత్యేక జడ్జి జారీ చేసిన సెర్చ్ వారెంట్ల నేపథ్యంలో దాడులు కొనసాగిస్తున్నట్లు విజిలెన్సు అధికార వర్గాలు తెలిపాయి.

టీ-20 మ్యాచ్ పరిశీలకుడిగా ప్రహ్లాద్



ప్రహ్లాద్

కొరాపుట్ : భారత్-బంగ్లాదేశ్ టీ-20 మ్యాచ్ పరిశీలకుడిగా నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రహ్లాద్ త్రిపాఠి (అర్జున్) నియమితులయ్యారు. ఈ నెల 12న హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో మూడో టీ-20 మ్యాచ్ జరగనున్న విషయం తెలిసిందే. ప్రహ్లాద్ గతంలో నబరంగ్‌పూర్ మున్సిపాలిటీ చైర్మన్‌గా, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీగా పనిచేశారు. ఈయన నియామకంపై జిల్లా క్రీడల సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో నందెన్న పూజలు



పూజలందుకుంటున్న నందెన్న

రాయగడ : స్థానిక కంద్రవీధిలో మంగళవారం నందెన్న ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. మహిళలు ఉదయం 8 గంటలకు జంఝావతి నదీతీరం నుంచి శుద్ధజలాలను తీసుకొచ్చి నందెన్న సన్నిధి ప్రాంగణాన్ని శుద్ధి చేశారు. ఉదయం విఘ్నేశ్వర పూజలతో ప్రారంభించి శివపార్వతులను ప్రత్యేకంగా నదీజలాలతో అభిషేకించారు.

చెరువులో మునిగి రెండేళ్ల బాలుడు మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి : చెరువులో మునిగి రెండేళ్ల బాలుడు మృత్యువాత పడిన ఘటన మంగళవారం మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి సుధకొండ గ్రామంలో చోటుచేసుకుంది. భీమా పోడియామి భార్య గంగి దసరా వేడుకల కోసం ఇంటిని శుభ్రం చేసే పనిలో నిమగ్నమైంది. మట్టితో ఇల్లు అలుకుతూ తన రెండేళ్ల కుమారుడు అభినేష్ పోడియామి సంగతి మర్చిపోయింది. ఈ సమయంలో బాలుడు ఇంటి పక్కనే ఉన్న చెరువులో దిగి మునిగిపోయాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో మృత్యువాతపడ్డాడు. కొద్దిసేపటి తర్వాత కుమారుడు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లి చెరువు వద్దకు వెళ్లి చూడగా కుమారుడు శవమై తేలియాడుతూ కనిపించాడు. వెంటనే కేకలు వేస్తూ విలపించడంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని కలిమెల పోలీసులకు సమాచారం అందించారు. ఐఐసీ చంద్రకాంత్ తండ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

ఉద్యోగులు.. దేశాభ్యున్నతికి వారథులు



నియామక పత్రాలు పంపిణీ చేస్తున్న సీఎం మోహన్‌చరణ్ మాఝీ



నియామక పత్రాలు పొందిన యువత

- సీఎం మోహన్‌చరణ్ మాఝి
- ఉద్యోగ మేళాలో నియామక పత్రాల పంపిణీ

భువనేశ్వర్: దేశ అభ్యున్నతికి ఉద్యోగులు వారధులు కావాలని, ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీ అన్నారు. స్థానిక లోక్ సేవా భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాలో రాష్ట్ర విద్యుత్, ఆరోగ్య – కుటుంబ సంక్షేమం, ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ సంస్థల్లో ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి నియామక పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి అవకాశాల్ని కల్పించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కొత్త ఉద్యోగులు అంకితభావం పనిచేసి ప్రజలకు సేవలందించాలన్నారు. ఉద్యోగుల సహాయ సహకారాలతో వికసిత ఒడిశా- నవ ఒడిశా ఆవిష్కరణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా తదితరులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో పీసీసీ ప్రెసిడెంట్ నియామకం



ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్: నెల రోజుల్లో ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుని నియామకం జరుగుతుందని కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్క ప్రకటించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం దేశ వ్యాప్తంగా రాజకీయ వేడి ఉందన్నారు. అందుకే అన్ని విధాలా ఆలోచించి సరైన వ్యక్తిని నియమిస్తామని చెప్పారు. ఈసారి నియమితులయ్యే పీసీసీ అధ్యక్షులు ఐదేళ్ల పాటు పదవిలో కొనసాగి ఎన్నికల ప్రక్రియ ముగిస్తారని తెలిపారు. కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయడం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు.

పారాదీప్ ఓడరేవులో ప్రమాదం



ప్రమాదం జరిగిన ప్రదేశం

భువనేశ్వర్: పారాదీప్ ఓడరేవులో మంగళవారం సరుకు రవాణా కార్యకలాపాల్లో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఓ కార్మికుడు గాయపడినట్లు సమాచారం. స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కటక్‌లోని ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రికి తరలించారు. ఎంపీబీ బెర్తులో ఎంవీ ఆమన్సి మేక్సిమస్ అనే ఓడ నుంచి సున్నపురాయి లోడును క్రేన్ ద్వారా దించుతుండగా అనుసంధాన తీగలు తెగడంతో ఈ ప్రమాదం సంభవించింది.

తల కలకలం

భువనేశ్వర్ : బాలాసోర్ జిల్లాలో మంగళవారం ఉదయం నడి రోడ్డుపై పాక్షికంగా కాలిన తల కనిపించడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. 16వ నంబరు జాతీయ రహదారిపై గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఖొంతాపాడా స్టేషన్ సిబ్బంది చేరుకుని పరిశీలించారు. పసిపిల్ల తలగా కొందరు భావిస్తుండగా.. పశువు తల అయి ఉంటుందని మరికొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సగభాగం కాలిపోవడంతో నిర్ధారణకు రాలేకపోతున్నారు. సైంటిఫిక్ టీమ్ పరీక్షించాక వాస్తవం తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

దుకాణాల్లో సోదాలు



తనిఖీలు నిర్వహిస్తున్నఅధికారులు

పర్లాకిమిడి : పట్టణంలో కొత్తబస్టాండ్, మార్కెట్ వద్ద మంగళవారం సబ్ కలెక్టర్ అనుప్ పండా ఆదేశాలమేరకు పౌరసరఫరాల శాఖ, పోలీసులు, ఫుడ్ సెక్యూరిటీ, తూనికలు కొలతలవిభాగాల అధికారులు పలు వ్యాపార సముదాయాలు, హోటళ్లలో దాడులు నిర్వహించారు. 9 గృహ వినియోగ సిలిండర్లు పట్టుకున్నారు. వారికి రూ.25 వేల జరిమానా విధించారు. ఈ దాడుల్లో జిల్లా ఆహార భద్రతా అధికారి తపస్వినీ బెహరా, అసిస్టెంట్ పౌరసరఫరాల శాఖ అధికారి బిష్ణుచరణ్ పరిడా, తూనికలు కొలతలు డిప్యూటీ కంట్రోలర్ ఘనశ్యాం బెహరా తదితరులు పాల్గొన్నారు.

నేడే సుభద్ర యోజన

భువనేశ్వర్: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా సాధికారిత పథకం సుభద్ర యోజన తొలి విడతలో లబ్ధిపొందని వారికి బుధవారం సొమ్ము జమ చేయనున్నారు. అర్హులైన వారికి మధ్యాహ్నం 12 గంటల కల్లా బ్యాంకు పొదుపు ఖాతాలకు రూ.5,000 చొప్పున నగదు జమ అవుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మహిళ – శిశు అభివృద్ధి శాఖ మంత్రి ప్రభాతి పరిడా తెలిపారు. పథకం ప్రారంభోత్సవం నాడు ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల మంది లబ్ధిదారుల ఖాతాకు నగదు జమ చేశారని, అప్పట్లో సాంకేతిక కారణాలతో నిలిపివేసిన 32 లక్షల మందికి నేడు సుభద్ర సొమ్ము జమ అవుతుందని చెప్పారు. ఈ నెల 7వ తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా సుభద్ర యోజన దరఖాస్తుదారుల సంఖ్య కోటీ 20 లక్షలకు చేరిందన్నారు. తొలి విడుత విడుదల సందర్భంగా లబ్ధిదారుల ఖాతాకు ప్రయోగాత్మకంగా రూ.1 బదిలీ చేసి అర్హులుగా ప్రకటించామని, ఈసారి అటువంటి చర్య ఏమీ లేనట్లు మంత్రి స్పష్టం చేశారు. ఏవైనా సందేహాలుంటే 14678 టోల్ ఫ్రీ నంబర్‌కు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

జంట నగరాల్లో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

భువనేశ్వర్: దసరా ఉత్సవాలు పురస్కరించుకుని కటక్, భువనేశ్వర్ నగరాల్లో పోలీసులు భద్రత పటిష్టపరిచారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా నగర వాసుల్ని అప్రమత్తం చేసేందుకు వీధుల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. నేరాల నియంత్రణపై గట్టి నిఘా ఏర్పాటు చేశారు. తొలి సారిగా ఈ ఏడాది శాంతి భద్రతల పరిరక్షణకు సాయుధ పోలీసు బలగాల్ని మోహరించారు. 102 ప్లాటూన్ల పోలీసులతో శాంతి భద్రతల పరిరక్షణ కార్యకలాపాల్ని 200 మంది అధికారులు పర్యవేక్షించనున్నారు. భువనేశ్వర్ నగరంలో 38 ప్లాటూన్లు, కటక్ నగరంలో 64 ప్లాటూన్ల పోలీసు బలగాల్ని రంగంలోకి దించినట్లు జంట నగరాల పోలీసు కమిషనరేట్ తెలిపింది. స్థానిక ఝురపడా, లక్ష్మీసాగర్ ప్రాంతాల్లో నగర డీసీపీ పినాక్ మిశ్రా పర్యవేక్షణలో 2 కంపెనీల సరిహద్దు రక్షణ బలగాలు, బీఎస్‌ఎఫ్ వర్గాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి.

25 గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

రాయగడ: జిల్లాలోని కాశీపూర్ సమితి టికిరిలో పౌరసరఫరాల శాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రాదేవి ఆదేశాల మేరకు జిల్లా అదనపు పౌరసరఫరాల అధికారి సుధాంశు భొయ్ నేతృత్వంలో హోటళ్లను తనిఖీ చేశారు. కమర్షియల్ సిలిండర్లకు బదులుగా వినియోగిస్తున్న 25 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా భొయ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ గ్యాస్ వినియోగిస్తున్న హొటల్ యజమానులపై కేసు నమోదు చేశామని చెప్పారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

జయపురం : మొబైల్ ఫోన్ దొంగతనం కేసులో నిందితుడిని జయపురం పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. తన మొబైల్ చోరీకి గురైందని జయపురం పట్టణానికి చెందిన తారా ఘోష్ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఉలాఘాట్‌కు చెందిన కార్తీక మాఝిని నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ పోలీసు అధికారి రశ్మీరంజన్ దొలాయ్ వెల్లడించారు.

స్టార్ట్.. కెమెరా.. యాక్షన్

- కొరాపుట్ జిల్లాలో తెలుగు సినిమా షూటింగ్ సందడి
- నటుడు జగపతిబాబును చూసేందుకు ఎగబడిన అభిమానులు



షూటింగ్‌కు వస్తున్న జగపతిబాబు

కొరాపుట్: కొరాపుట్ జిల్లాల్లో ఇటీవల కాలంలో తెలుగు సినిమా షూటింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా నందపూర్, లమ్తాపుట్ సమితుల పరిధిలో డుడుమా జలపాతం వద్ద 'ఘాటీ' అనే తెలుగు సినిమా చిత్రీకరణ జరుపుకుంటోంది. అయితే చిత్రబృందం మాత్రం పూర్తి వివరాలు వెల్లడించేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. ప్రముఖ నటుడు జగపతిబాబు, అనుష్క శెట్టిలు ఈ చిత్రంలో నటిస్తున్నారని సమాచారం. ఈ సందర్భంగా సినీ నటులను చూసేందుకు, వారితో సెల్ఫీ తీసుకునేందుకు స్థానికులు ఎగబడ్డారు.



సన్నివేశాల చిత్రీకరణలో సిబ్బంది



షూటింగ్ చూసేందుకు వచ్చిన స్థానికులు

క్లుప్తంగా

ఇసుక టిప్పర్ పట్టివేత

పోలాకి: మండలంలోని జొన్నాం గ్రామం వద్ద వంశధార తీరంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని మంగళవారం పట్టుకున్నట్లు పోలాకి ఎస్ఐ రంజిత్ తెలిపారు. గత నెలరోజులుగా మండలంలోని పల్లిపేట, డోల, జొన్నాం, మబగాం, వనిత మండలం తదితర చోట్ల నుంచి రాత్రిపూట ఇసుక తరలిపోతుందని విమర్శలు నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. పైడితల్లి ఉత్సవాలకు పోలీసులు వెళ్తున్న నేపథ్యంలో ఈ ఇసుక తరలింపు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు పోలీసులకు కూడా సమాచారం అందినట్లు చెబుతున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. భారీ, మధ్య, చిన్న నీటి పారుదల ప్రాజెక్టుల వారీగా సాగునీటి సంఘాలకు వచ్చే నెల నాటికి ఎన్నికలు పూర్తి చేయాలని, అందుకు తగ్గ ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి అధికారులతో మాట్లాడారు. ప్రాజెక్టుల పరిధి ఆధారంగా ఓటర్ల జాబితాను సవరించాలని, ఆయకట్టు, డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టుల పరిధిలో కొత్తగా వచ్చిన ప్రాంతాలను కలిపి ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు.

డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు..

శ్రీకాకుళం పాత బస్టాండ్: ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించేందుకు శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహనరెడ్డి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఎస్సీలు వంద మందికి, ఎస్టీలు వంద మందికి ఈ శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని, 21వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో రెండు సార్లు శిక్షణ ఇచ్చే సంస్థలు అర్హులని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో భవానీ దీక్షాధారి మృతి


మణికంఠ

కంచిలి: భవానీ దీక్షలో ఉన్న కోన మణికంఠ(18) అనే యువకుడు ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ కు గురై మృతిచెందాడు. ఈ సంఘటన కంచిలి మండలంలో మఠంసరియాపల్లి పంచా యతీ పరిధి నారాయణబట్టి గ్రామంలో మంగళవారం చోటు చేసుకొంది. స్థానికులు, పోలీసులు చెప్పిన కథనం ప్రకా రం.. గ్రామానికి చెందిన మణికంఠ భవానీ దీక్ష లో ఉన్నారు. మంగళవారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో పప్పు కడిగిన నీరు బ యటకు తీసుకెళుతుండగా వీధిలో ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు తలపైన బకెట్‌కు తగిలింది. వైరును చేతిలో పైకి లేపి పక్కకు తీసేందుకు ప్ర యత్నించగా.. అక్కడే ఆ వైరుకు చీలిక ఉండడంతో షాక్ కొట్టింది. షాక్‌కు గురైన మణికంఠను వెంటనే స్థానికులు సోంపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ మృతిచెందాడు. మృతుని తండ్రి చిరంజీవి, తల్లి చిన్నారితోపాటు ఒక చెల్లెలు ఉంది. యువకుడు బారువ ప్రభుత్వ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి చిరంజీవి మంగోలియాలో పనిచేస్తుంటారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. మణికంఠ మృతితో తోటి దీక్షాధారులు దీక్ష విరమించారు.

బైక్ నుంచి జారిపడి వృద్ధురాలి మృతి


మృతి చెందిన కుందంగి సంజీవమ్మ

నందిగాం: నందిగాం పంచాయతీ కొండపేటకు చెందిన కుందంగి సంజీవమ్మ(73) బైక్‌పై నుంచి జారి పడి మృతి చెందారు. గ్రామస్తులు, నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవమ్మ సో మవారం ఉదయం కిరాణా సామాన్లు కొనేందుకు నందిగా వచ్చారు. తిరిగి గ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా తన గ్రామానికే చెందిన బొడ్డు జనార్ధన ద్విచక్రవాహనంతో రావడంతో బైక్ ఆపి ఎక్కారు. బండి మణిగాం జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదుపు తప్పడంతో ఆమె కిందకు పడిపోయారు. తలకు గాయం కావడంతో గ్రామస్తులు టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మృతురాలి కుమారుడు చిన్నారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ డిల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాబ్‌మేళాలో 68 మంది ఎంపిక

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు మంచి స్పందన వచ్చింది. 207 మంది పాల్గొనగా ఇందులో 68 మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఉరిటి సాయి కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 8 నియోజకవర్గాల్లో స్కిల్ హబ్స్ నిర్వహిస్తున్నామని అన్నారు.

ఆదివాసీల ఆందోళన

- అటవీ భూములు, పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్
- పర్లాకిమిడిలో ఏ.ఐ.కె.ఎం.ఎస్ ఆధ్వర్యంలో ధర్నా


గజపతి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆదివాసీలు

పర్లాకిమిడి: అనేక ఏళ్లుగా నివాముంటున్న ఆదివాసీలకు అటవీ భూములు, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ గజపతి జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున ధర్నా చేపట్టారు. ముందుగా ఏ.ఐ.కె.ఎం.ఎస్.గజపతి జిల్లా కార్యదర్శి కేదార్ శోబోరో, జాతీయ కార్యదర్శి బాలచంద్ర షడంగి, రైతు కూలీ సంఘం ప్రతినిధులతో కలిసి వందలాది రైతులు కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కిసాన్ సభ జాతీయ కార్యదర్శి బాలచంద్ర షడంగి మాట్లాడుతూ రాష్ట్ర బీజేపీ సర్కారు కార్పొరేట్ల కోసం ఆదివాసీ గిరిజన భూములను ధారాదత్తం చేస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు పూర్తయినా సామాజిక పింఛన్ల పెంపు రూ.3 వేలు హామీ నెరవేర్చలేకపోయిందని దుయ్యబట్టారు. జిల్లాలో యువతీ యువకులు ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలసబాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ హక్కుల చట్టం–2006 అమలైతే ఆదివాసీలకు మేలు జరిగి ఉండేదని జిల్లా కమిటీ సభ్యులు కడుకా శోబోరో అన్నారు. జంగిల్ జమ్మి పట్టాలు ఇప్పించాలని, మన్‌రేగా పథకం కింద 250 రోజుల పనిదినాలు కల్పించాలని, దివ్యాంగులకు నెలకు రూ.5వేలు పింఛన్, వృద్ధులకు రూ.3 వేలు పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సోంబురో శోబోరో, ఘనశ్రీ శోబోరో తదితరులు పాల్గొన్నారు.

కోటి మంది సభ్యత్వం లక్ష్యం

- నేటి నుంచి బీజేడీ సభ్యత్వ నమోదు ప్రక్రియ


మాట్లాడుతున్న దేవీప్రసాద్ మిశ్రా

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రముఖ ప్రాంతీయ పార్టీగా విశేష ప్రజాదరణ పొందిన బిజూ జనతా దళ్ పార్టీ సభ్యత్వ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. ఉత్కళమణి గోపబంధు దాస్ జయంతి పురస్కరించుకుని బుధవారం నుంచి ఈ ప్రక్రియకు శ్రీకారం చుడుతుంది. స్థానిక బీజేడీ రాష్ట్ర కార్యాలయం శంఖభవన్‌లో అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో ప్రారంభిస్తారు. ఈ ఏడాది కోటి మందిని సభ్యులుగా చేర్పించే లక్ష్యంతో బీజేడీ ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ ఏడాది సభ్యత్వ నమోదు కోటి మంది కాగా విద్యార్థులు, యువతరం నమోదు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు దేవీ ప్రసాద్ మిశ్రా విలేకర్లకు వివరించారు. ఇప్పటి వరకు కోటి కాగా 3 లక్షల 40 వేల మంది క్రియాశీలక సభ్యులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈసారి రెండు విడతల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో సభ్యత్వ నమోదు ఉంటుందని, దసరా తర్వాత కార్యక్రమం ఊపందుకుంటుందని వివరించారు.

ముగిసిన సంపూర్ణ అభిజాన్


ఉత్తమ ఉద్యోగులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే సత్యజీత్


స్టాల్స్‌ను సందర్శిస్తున్న ఎమ్మెల్యే

రాయగడ: జిల్లాలో జూలైలో ప్రారంభమైన సంపూర్ణ అభిజాన్ చైతన్య కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన సమితుల అభివృద్ధికి నీతి ఆయోగ్ కార్యక్రమం అమలు చేసిందన్నారు. దీని ద్వారా ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధితో పాటు విద్య, వైద్యం, వ్యవసాయం, స్వయం సంఘాల అభివృద్ధి, గ్రామీణాభివృద్ధి వంటి అంశాల్లో ప్రజలను చైతన్యపరచడంలో సఫలీకృతమయ్యామని చెప్పారు. అయితే ఇక్కడితో అభివృద్ధి సాధ్యపడదని, వాటిని సకాలంలో సద్వినియోగపరిచేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లా పరిషత్ కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో మాట్లాడుతూ వెనుకబడిన సమితుల్లో ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. అనంతరం అభిజాన్ విజయవంతానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ బహుమతులు అందజేశారు. అంతకుముందు డీఆర్‌డీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత


ప్రాకృతిక మిత్రా అవార్డు, నగదు బహుమతిని అందుకుంటున్న ప్రతినిధులు

రాయగడ: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక అన్నారు. స్థానిక ఫారెస్ట్ పార్కులో మంగళవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అడవులు అంతరించిపోతుండటంతో వన్యప్రాణులు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కొందరు స్వార్థపరులు వన్యప్రాణులను వేటాడి చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు గిరిజనులు అడవులను తగులబెడుతుండటంతో వన్యప్రాణులు మానవులు సంచరించే ప్రాంతాలకు వెళ్లి అక్కడ బలైపోతున్నాయని చెప్పారు. అడవులను సంరక్షించినప్పుడే వన్యప్రాణులను కాపాడుకోగలమని తెలిపారు. అటవీ శాఖ అధికారి అన్నా సాహెబ్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి తదితరులు వన్యప్రాణుల విలువలు, వాటి ఆవశ్యకతను వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కోరుతూ మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నఉత్కళ మీడియా సంఘం ప్రాకృతిక మిత్రా–2024కు అవార్డు అందజేశారు. సంఘం ప్రతినిధులు దయానిధి ఖడంగ, సరోజ్ సాహు, మనోజ్ సాహులు పదివేల రుపాయల చెక్‌ను అందుకున్నారు.

గురండిలో బీజేపీ సభ్యత్వ అభియాన్


సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గుసాని సమితి గురండి గ్రామంలోని మీనాకేతన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం బీజేపీ సభ్యత్వ అభిమాన్ నిర్వహించారు. యువమోర్చా నాయకులు కోట్ల యువరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పిన్నింటి క్రాంతి, రౌతుభార్గవ్, పోలాకి నరేష్ తదితరులు పాల్గొన్నారు.


రైతులకు రూ.574 కోట్ల పంట రుణాలు



కేసీసీ బ్యాంక్ కార్యాలయం

జయపురం: కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్(కేసీసీ బ్యాంక్) తరఫున జయపురంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో 1,10,555 మంది రైతులకు రూ.574 కోట్ల 23 లక్షల 60 వేలు పంట రుణాలు అందజేసినట్లు బ్యాంకు అధికారులు మంగళవారం వెల్లడించారు. కొరాపుట్ జిల్లాలో 40,848 మంది రైతులకు రూ.205 కోట్లు, నవరంగపూర్ జిల్లాలో 24,240 మంది రైతులకు రూ.149 కోట్లు, మల్కన్‌గిరి జిల్లాలో 25,836 మంది రైతులకు రూ.117 కోట్లు, రాయగడ జిల్లాలో 19,742 మంది రైతులకు రూ.101 కోట్ల మేర రుణాలుగా అందజేసినట్లు వెల్లడించారు.

కార్యాలయాలకు కొత్త రంగులు


కొత్త రంగులివే

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల రంగులు మారనున్నాయి. రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటైన బీజేపీ ప్రభుత్వం ఇటీవల మాధ్యమిక పాఠశాల విద్యార్థుల స్కూల్ యూనిఫారమ్ రంగు మార్చిన విషయం తెలిసిందే. తాజాగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల భవనాల రంగులు మార్చాలని నిర్ణయించడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వ కార్యాలయం, సంస్థల భవనాల గోడలకు నారింజ రంగు, అంచులను ఎరుపు రంగు తో తీర్చిదిద్దుతారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణ విభాగం ప్రత్యేక కార్యదర్శి లక్ష్మీకాంత పాఢి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ విభాగాలు, శాఖల చీఫ్ ఇంజినీర్లు, ఒడిశా వంతెనల నిర్మాణ సంస్థ ఓబీసీసీ మేనేజింగ్ డైరెక్టరుకు ఈ లేఖలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. వీరి పర్యవేక్షణలో గోడలు రంగులు అద్దుతారు. ఏటా వర్షాకాలం తర్వాత గోడల నిర్వహణలో భాగంగా కొత్తగా రంగుల్ని వేయడం ఆనాయితీగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అన్ని ప్రభుత్వ సంబంధిత భవనాలకు ఒకే అద్దేందుకు నిర్ణయించారు.

వంట సహాయకులను కార్మికులుగా గుర్తించాలి


మాట్లాడుతున్న అధ్యక్షురాలు ఉత్తమ మల్లిక

జయపురం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వంట సహాయకులుగా పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించాలని ఒడిశా వంట సహాయకుల సంఘ అధ్యక్షురాలు ఉత్తమ మల్లిక డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్మిక భవనంలో ఏఐటీయూసీ అనుబంధంగా ఉన్న మధ్యాహ్న భోజన వంట సహాయకుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంట సహాయకుల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వంట సహాయకులకు రూ.5000 పెన్షన్, గృహ వసతి, పిల్లలకు ఉచిత విద్య, కుటుంబ సభ్యులందరికీ ఉచిత వైద్యం వంటి సౌకర్యాలు సమకూర్చాలని డిమాండ్ చేశారు.

సమస్యల సాధన కోరుతూ నవంబర్ 25న భువనేశ్వర్‌లో ఆందోళన చేపడతామని చెప్పారు. కొరాపుట్ జిల్లా నుంచి ప్రతినిధులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కమల భొత్ర, దొనాయి మాఝి, చంద్రమ దిసారి, జెమా హలవ, కుసుమ పూజారి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సుల బంద్ రద్దు


ప్రైవేటు బస్సులు

జయపురం: లక్ష్మీబస్సుల కొనసాగింపును వ్యతిరేకిస్తూ సోమవారం సాయంత్రం 6 నుంచి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు ప్రైవేటు బస్సుల బంద్ చేపడతామని ప్రకటించిన బస్సు యజమానుల సంఘం ఆ ప్రకటనను విరమించుకుంది. దక్షిణ, పశ్చిమ ప్రైవేట్ బస్సుల అసోసియేషన్ ప్రతినిధులతో రవాణా శాఖ మంత్రి బిభూతి భూషణ జెనా సోమవారం సాయంత్రం భువనేశ్వర్‌లో చర్చలు జరిపిన అనంతరం బంద్ నిర్ణయాన్ని విరమించుకున్నట్లు ప్రకటించింది. చర్చల్లో తీసుకున్న నిర్ణయం మేరకు ఎప్పటి లాగే లక్ష్మీ బస్సులు దూర ప్రాంతాలకు నడుస్తాయని కొరాపుట్ జిల్లా ప్రయివేట్ బస్సు యజమానుల అసోసియేషన్ కార్యదర్శి నరేంద్రకుమార్ మహంతి మంగళవారం ప్రకటించారు.

సమితిల నుంచి జిల్లా కేంద్రాలకు లక్ష్మీ బస్సులు నడపటాన్ని తాము వ్యతిరేకించి బస్సుల బంద్‌కు పిలుపునిచ్చామని, అయితే దసర ఉత్సవాల సమయంలో బస్సుల బంద్ సముచితం కాదని బంద్ విరమించుకున్నామని స్పష్టం చేశారు.

మహిళా కాలేజీలో నాలెడ్జ్ సెంటర్ ప్రారంభం



వేదికపై ప్రసంగిస్తున్న అతిథులు

మల్కన్‌గిరి : జిల్లా కేంద్రంలోని మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన ఒడిశా నాలెడ్జ్ కార్పొరేషన్ లిమిటెడ్(ఓకేసీఎల్) సెంటర్‌ను మంగళవారం అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలెడ్జ్ సెంటర్‌లో విద్యార్థులకు కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే సులువుగా ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు.

కార్యక్రమంలో జిల్లా రిక్రూట్‌మెంట్ అధికారి మానీస్వ శెఠి, ప్రిన్సిపాల్ దుస్మంత్, ప్రోగ్రామ్ మేనేజర్ సుజంత్‌దాస్, జిల్లా చీఫ్ కో–ఆర్డినేటర్ దేవిప్రసాద్ స్వయి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


హాజరైన విద్యార్థులు

హౌస్‌కీపర్లను విధుల్లోకి తీసుకోవాలి


తొలగింపునకు గురైన హౌస్‌కీపర్లు

మల్కన్‌గిరి: రాష్ట్రవ్యాప్తంగా పోలీసుస్టేషన్లలో ఖాళీగా ఉన్న 1292 హౌస్ కీపర్ల పోస్టుల భర్తీకి రాష్ట్ర క్యాబినెట్ మంగళవారం ఆమోదం తెలియజేసింది. ఈ నేపథ్యంలో మల్కన్‌గిరి జిల్లాలో 25 మందికి పైగా హౌస్‌కీపర్లను అకారణంగా తొలగించారని, వీరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ యూనియన్ సభ్యుడు విజయ్‌కుమార్ ఖితి ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

15 రోజుల్లో సీసీ కెమెరాలు పునరుద్ధరిస్తాం

భువనేశ్వర్: పోలీస్‌స్టేషన్లలో 15 రోజుల్లో సీసీ కెమెరాల వ్యవస్థను పునరుద్ధరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. భరతపూర్ పోలీసుస్టేషన్ వివాదం కేసు విచారణ సందర్భంగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు స్టేషన్లలో సీసీటీవీ కెమెరా వ్యవస్థకు సంబంధించి పూర్తి సమాచారంతో అఫిడవిటు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పోలీస్ అదనపు డైరెక్టర్ జనరల్ దయాల్ గంగవార్ అఫిడవిట్ దాఖలు చేశారు. రాష్ట్రంలోని 593 పోలీస్‌స్టేషన్లకు గాను 13 చోట్ల సీసీ టీవీ కెమెరాల వ్యవస్థ అందుబాటులో లేదని, మరో 456 స్టేషన్లలో ఈ వ్యవస్థ మొరాయిస్తోందని చెప్పారు. సీసీటీవీలు లేని 13 ఠాణాల్లో 15 రోజుల్లో వ్యవస్థను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. సీసీటీవీ కెమెరా వ్యవస్థని సంబంధిత జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయం వ్యవస్థతో అనుసంధానిస్తామని ఏడీజీ హైకోర్టు ధర్మాసనానికి వివరించారు. అనంతరం కేసు తదుపరి విచారణను నవంబరు నెల 12వ తేదీకి ఉన్నత న్యాయస్థానం వాయిదా వేసింది.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు


ట్రాఫిక్‌పై సమీక్షిస్తున్న పోలీసు అధికారులు


బైక్‌లను స్టేషన్‌కు తరలిస్తున్న సిబ్బంది

జయపురం: దసరా ఉత్సవాల సందర్భంగా జయపురం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు దృష్టి సారించారు. జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకితకుమార్ వర్మ, పట్టణ పోలీసు అధికారి రశ్మీరంజన్ దొలాయి, మునిసిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్ బృందం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను సమీక్షించారు. జయపురం కూడలి నుంచి సూర్యమహల్ వరకు ప్రధాన మార్గంలో నో పార్కింగ్ బోర్డులను తొలగించారు. మహారాజా హోటల్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసిన 4 వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ముఖ్యంగా పూజా మండపాల వద్ద రద్దీ లేకుండా రెండు ప్లాటూన్‌ల పోలీసు బలగాలను మోహరించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రతిఒక్కరూ సహకరించాలని పోలీసు అధికారి అంకితకుమార్ వర్మ కోరారు.

క్లుప్తంగా

నాలుగు ఇసుక లారీలు సీజ్



సీజ్ చేసిన ఇసుక లారీలు

పాలకొండ: మండలంలోని మంగళాపురం సమీపంలో నాగావళి నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలను రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. సోమవారం రాత్రి సమయంలో కొంత మంది ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించిన సబ్‌కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి తహసీల్దార్ బాలము రళీకృష్ణకు ఆదేశాలు జారీ చేయ డంతో ఆయన సిబ్బందితో వెళ్లి నాలుగు ఇసుక లారీలను గుర్తించారు. ఒక్కొక్కటి 27 టన్నుల ఇసుకతో ఉన్న లారీలను సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించారు.

ఎనిమిది తులాల బంగారం చోరీ

చీపురుపల్లి: పల్లెటూరిలో పట్టపగలు ఉదయం 8 గంటల సమయంలో అందరూ సంచరిస్తుండగా ఎనిమిది తులాల బంగారం చోరీకి గురైంది. చీపురుపల్లి మండలంలోని మెట్టపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి బాధితులు శేషపు కృష్ణ, జయమ్మ అందించిన వివరాల్లోకి వెళ్తే..గ్రామానికి చెందిన శేషపు కృష్ణ, జయమ్మ దంపతులు ఉదయం 8 గంట సమయంలో జొన్నలు ఆడించేందుకు గ్రామ శివారున ఉన్న శివాలయం వద్దకు వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లాక జొన్నలు ఆడించే చేటలు మరిచిపోవడంతో జయమ్మ తిరిగి చేటల కోసం ఇంటికి వచ్చింది. ఆమె ఇంటికి చేరుకునే సమయానికి ఇంటి తలుపులు తెరిచి ఇంట్లోని వస్తువులు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. అంతేకాకుండా కబోర్డు కూడా తెరిచి ఉంది. దీంతో విస్మయానికి గురైన జయమ్మ కబ్‌బోర్డులో వస్తువులను పరిశీలించగా అందులో ఉండాల్సిన మూడున్నర తులాల పుస్తెల తాడు, మూడున్నర తులాల గొలుసులు, అరతులం చొప్పున రెండు ఉంగరాలు మొత్తం ఎనిమిది తులాల విలువైన బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో లబోదిబోమంటూ ఆ దంపతులు పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం మేరకు పోలీసులు, క్లూస్ టీమ్‌తో గ్రామానికి వచ్చి పరిశీలించి ఆధారాలు సేకరించారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి


- మరో నలుగురికి గాయాలు



వానపల్లి సాగర్ మృతదేహం

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై చినభోగిలి–కాశీపేట గ్రామాల మధ్య మంగళవారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్ వెంకంపేట గ్రామానికి చెందిన వానపల్లి సాగర్(20), జె శివవరప్రసాద్, జి పారన్నాయుడులు మోటార్ సైకిల్‌పై సీతానగరం నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. అదే సమయంలో పాచిపెంటమండలం రొడ్డవలస గ్రామానికి చెందిన వై.బాలయ్య, పి.పోతయ్య టీవీఎస్ వాహనంపై బొబ్బిలి నుంచి సీతానగరం వైపు వస్తున్నారు. ఆ రెండువాహనాలు కాశీపేట–చినభోగిలి గ్రామాల మధ్య ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గాయాపాలైన ఐదుగురిని పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా వానపల్లి సాగర్ మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు వైద్యాధికారులు ధ్రువీకరించారు. మిగతా నలుగురు చికిత్స పొందుతున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు.

కారు, ఆటో ఢీ: ఆరుగురికి గాయాలు



సంఘటన స్థలంలో ఆటో, కారు

దత్తిరాజేరు: మండలంలోని ఎస్.బూర్జవలస పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం సాయంత్రం కారు, ఆటో ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఆరుగురు గాయాలపాలైనట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. రామభద్రపురం నుంచి పెదమానాపురం వస్తున్న కారు మరడాం నుంచి కె.కృష్ణాపురం వెళ్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటోలో ఉన్న పలివాడ కృష్ణమ్మ, చిప్పాడ లక్ష్మి, సుమల సత్యవతి, సావు వరాలమ్మ, కళింగపట్నం బంగారమ్మ, జితేంద్ర తదితరులకు గాయాలయ్యాయి. దీంతో వారిని వెంటనే గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించి వివరాలు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విజయనగర ఖ్యాతి ఇనుమడించేలా ఉత్సవాలు

- క్రీడానైపుణ్యాన్ని పెంచేందుకు కృషి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విజ్జీ స్టేడియంలో క్రీడోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం: జిల్లా ఖ్యాతి ఇనుమడించేలా విజయనగర ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మన వైభవాన్ని దశదిశలా చాటేందుకు ఈ ఉత్సవాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో కలిసి మంత్రి శ్రీనివాస్ ఉత్సవ వేదికలను మంగళవారం పరిశీలించారు. ముందుగా విజ్జీ స్టేడియాన్ని సందర్శించారు. నూతనంగా నిర్మితమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించి, ప్రారంభానికి సిద్ధం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. విద్యుత్ సదుపాయం కోసం 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని చెప్పారు. స్కేటింగ్ ట్రాక్‌ను, వాలీబాల్ కోర్టును, పోటీలు నిర్వహించే క్రీడామైదానాన్ని, క్రికెట్ స్టేడియాన్ని ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు. ఫ్లడ్‌లైట్లు, నెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేడియంలో భద్రతా ఏర్పాట్లు చేయాలని, స్టేడియం నుంచి స్కేటింగ్ ట్రాక్‌కు మెట్లు నిర్మించాలని చెప్పారు.

లేజర్ షో ద్వారా చరిత్ర

కోట వెనుకభాగంలో జరుగుతున్న సుందరీకరణ పనులను మంత్రి పరిశీలించారు. అక్కడ లేజర్‌షో ద్వారా విజయనగరం చరిత్రను వివరించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆ ప్రాంతాన్ని అందంగా, అహ్లాదకరంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. అనంతరం మాన్సాస్ గ్రౌండ్‌లోని సరస్ డ్వాక్రా ఎగ్జిబిషన్ ఏర్పాట్లను పరిశీలించారు. పుష్పప్రదర్శన స్టాల్, సాంస్కృతిక కార్యక్రమాల వేదికలను సందర్శించారు. ఈనెల 10వ తేదీన ప్రారంభం కానున్న అఖిలభారత డ్వాక్రా బజార్ (సరస్) పోస్టర్లను, పాంప్లేట్లను ఈ సందర్భంగా మంత్రి ఆవిష్కరించారు.

ఖ్యాతి ఇనుమడించేలా:

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్తరాంధ్రస్థాయి క్రీడాపోటీలను విజ్జీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పర్యటనలో మున్సిపల్ కమిషనర్ నలనయ్య, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ఏపీడీ సావిత్రి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు ఐవీపీరాజు, ఇతర అధికారులు, కోచ్‌లు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



చదురుగుడి అమ్మవారు



వనంగుడిలో కొలువైన పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలం కరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ అమ్మవారికి వేకువ జామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో దర్శించేందుకు తరలివచ్చారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చదురుగుడి ఆలయం పక్కన ఉన్న ఖాళీస్థలాన్ని టెంట్‌లు, కింద మ్యాట్‌లు వేసి క్యూ కాంప్లెక్స్‌గా తయారుచేశారు. క్యూలో ఉన్న భక్తులకు మజ్జిగ, మంచినీటిని, చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లు, పాలను అందించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు అమ్మవారికి విశిష్ట కుంకుమార్చన నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడిలో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

భద్రతా ఏర్పాట్లపై డీఐజీ పర్యవేక్షణ

- పైడితల్లి జాతర బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన




పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ వకుల్ జిందాల్, ఈఓ ప్రసాదరావు తదితరులు

విజయనగరం క్రైమ్: విజయనగర, ఉత్సవాలు, శ్రీ పైడితల్లి అమ్మవారి తొలేళ్లు, సిరిమానోత్సవం సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఏర్పాటుచేస్తున్న బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా ఎస్పీ వకుల్ జిందాల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఇతర అధికారులతో కలిసి అమ్మవారి ఆలయం, క్యూలు, దేవాలయం వెనుకభాగం, కమాండ్ కంట్రోల్ రూమ్, మూడులాంతర్లు, గురజాడ అప్పారావు రోడ్డు, కోట జంక్షన్ ప్రాంతాలను, గుర్తించిన పాత భవనాలను స్వయంగా క్షేత్రస్థాయిలో సందర్శించి పలు సూచ నలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమ్మవారి పండగ, ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో రానున్న నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. సిరిమాను, ఇతర రథాలు తిరిగే మార్గంలో ఎక్కువ సంఖ్యలో భక్తులు రాకుండా ఐరన్ బారికేడింగ్ ఏర్పాటుచేయాలని, ముఖ్య కూడళ్లలో మూడంచెల్లో ఐరన్ బారికేడింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. ప్రజలు కూడా పోలీసు శాఖ చేపట్టే చర్యలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

2 వేలమంది పోలీసు బందోబస్తు

క్షేత్రస్థాయి పర్యటన అనంతరం పోలీస్ అధికారులతో నిర్వహించిన డీఐజీ జెట్టి నిర్వహించిన సమీక్షలో విజయనగర ఉత్సవాలు, తొలేళ్లు, సిరిమానోత్సవానికి సంబంధించి 2వేల మందితో పోలీసు బందోబస్తు మూడు షిఫ్ట్‌లతో వినియోగిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ట్రాఫిక్ రెగ్యులేషన్, వాహనాల మళ్లింపు, పార్కింగ్ స్థలాల వద్ద ప్రత్యేకంగా పోలీస్‌సిబ్బందిని కేటాయిస్తున్నామని తెలిపారు. అమ్మవారి ఆలయం దగ్గరలో తాత్కాలికంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేసి, వాటికి 80 సీసీ కెమెరాలను, బాడీవార్న్ కెమెరాలను అనుసంధానం చేసి భద్రతను పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. శిథిలావస్థలో ఉన్న 11 భవనాలు గుర్తించి, ఆయా ఇంటి యజమానులకు నోటీసులు జారీచేసి, వాటిపైకి ఎవరినీ అనుమతించకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. ఏరియల్ నిఘా కోసం మూడు డ్రోన్స్‌ను వినియోగిస్తున్నామన్నారు. ముఖ్య ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించేందుకు బీడీ టీమ్‌లను, అత్యవసర సమయాల్లో స్పందించేందుకు ప్రత్యేకంగా క్యూఆర్ టీమ్స్‌ను ఏర్పాటుచేశామని తెలిపారు.

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత



సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజకు సత్కారం

విజయనగరం: అమ్మ వంటి మాతృ భాషను గౌరవించుకోవాలని, తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలో ఆయన పర్యటిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. స్వచ్ఛ భారత్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికైన రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఏకైక కవి సుద్దాల అశోక్ తేజను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం పరిపాలన అధికారి డాక్టర్ ఎస్‌వీఎస్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు రామతీర్థంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో బుధవారం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం జరగనుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలనంతరం సాయంత్రం 4 గంటలకు స్వామి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించనున్నామని అర్చకులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 12న పూర్ణాహుతి, అవబృదం, చక్రస్నానం, జమ్మివేట, ధ్వజావరోహణ కార్యక్రమాలు కొనసాగుతాయని, 13న శ్రీ వేంకటేశ్వరస్వామికి పుష్పయాగం జరిపించి బ్రహ్మోత్సవాలను పూర్తి చేయనున్నట్లు చెప్పారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహం

కేజీబీవీల్లో నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్:

సమగ్రశిక్ష సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న కేజీబీవీ విద్యాలయాల్లో నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఒక సంవత్సరం కాలానికి పనిచేయడానికి అర్హులైన మహిళాఅభ్యర్థుల నుంచి ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని డీఈఓ తెలిపారు. దరఖాస్తులను మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆఫ్‌లైన్‌లో అందజేయాలన్నారు. జిల్లాలో ఉన్న టైప్–3, టైప్–4 కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీల్లోని 55 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. టైప్–3 కేజీబీవీల్లోని అసిస్టెంట్ కుక్–20, డే అండ్ నైట్ వాచ్ ఉమెన్–9, స్కావెంజర్–11, స్వీపర్లు–02, టైప్–4 కేజీబీవీల్లో అసిస్టెంట్ కుక్‌లు–5, చౌకీదారులు–6, హెడ్ కుక్‌లు– 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు నమూనా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి పొందవచ్చన్నారు. ఎంపిక ప్రక్రియ అర్హత ఆధారంగా జరుగుతుందని, కేజీబీవీల్లో ఇంతకు ముందు పనిచేసే అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. వాచ్ ఉమెన్, చౌకీదారు పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణత విద్యార్హతకాగా, మిగిలిన పోస్టులకు విద్యార్హత లేదని తెలిపారు. అభ్యర్థులు 18 సంవత్సరాల వయసు పూర్తిచేసి ఒకటి జూలై 2024 నాటికి 42 సంవత్సరాలు మించరాదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 47 సంవత్సరాలు, సర్వీస్ ఉమెన్ అభ్యర్థులకు 45 సంవత్సరాల వరకు వయసు మినహాయింపు ఉందన్నారు.

డీఎస్సీ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్:

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీలో శిక్షణ ఇవ్వడానికి సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.డి గయాజుద్దీన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన శిక్షణ సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు శిక్షణను సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్స్‌లో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపేనల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే శిక్షణ సంస్థలు రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు శిక్షణ ఇచ్చి ఉండాలనే నిబంధనలు విధించినట్లు పేర్కొన్నారు. డీస్సీ శిక్షణ సంస్థలను జాబితాలోకి చేరడానికి పూర్తి వివరాలను ఈ–(ప్రొక్యూర్‌మెంట్) పోర్టల్ (హెచ్‌టీటీపీ://టెండర్.ఏపీఈమెంట్.జీఓవీ.ఇన్)లో అప్‌లోడ్ చేశామని తెలిపారు. ఆసక్తి ఉన్న శిక్షణ సంస్థలు ఇతర వివరాలకోసం ఈఓఐ డాక్యుమెంట్‌ను ఏపీ ఈ–ప్రొక్యూర్‌మెంట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు. ఈనెల 21లోగా దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

డీలర్లను రేషనలైజేషన్ చేయాలి

- జేసీకి ఏపీ డీలర్స్ వెల్ఫేర్ సొసైటీ వినతి



జేసీ సేతు మాధవ్‌కు సమస్యలు చెప్పుకుంటున్న సంఘం ప్రతినిధులు

విజయనగరం అర్బన్: జిల్లాలో చేపడుతున్న రేషన్ డిపోల బై ఫర్‌కేషన్‌లో డీలర్లకు అన్యాయం జరగకుండా రేషనలైజేషన్ చేయాలని ఏపీ ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు మంగళవారం సంఘం ప్రతినిధులు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జీవో నంబర్ 35ను అనుసరించి ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 10 ప్రకారం జరుగుతున్న ఈ ప్రక్రియ కంటే ముందు రేషనలైజ్ చేసి డీలర్ల వయబిలిటీకి తగిన విధంగా కార్డులను కేటాయించాలని కోరారు. జిల్లాలోని కార్పొరేషన్ మున్సిపాలిటీ రూరల్ గ్రామాల్లో చాలా రేషన్ దుకాణాలకు కనీస కార్డులు లేని పరిస్థితులు ఉన్నాయని చెప్పుకున్నారు. అలాంటి రేషన్ దుకాణాలకు తగిన సంఖ్యలో కార్డులు కేటాయించే విధంగా రేషనలైజేషన్ చేయాలని కోరారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఆయా ప్రాంతాల్లో ఉన్న రేషన్ దుకాణాల్లో సచివాలయ వారీగా కార్డులను ఫిజికల్‌గా ఎన్యూమరేషన్ చేసి సింగిల్ మెంబర్ కార్డు (చనిపోయిన వారిని), మైగ్రేషన్ అయిన కార్డులను మ్యాపింగ్ జాబితా నుంచి తొలగించాకే రేషన్ షాపుల పునర్ మ్యాపింగ్ చేయాలని కోరారు. నిబంధన ప్రకారం కార్డులు అన్ని దుకాణాలకు కేటాయించే విధంగా రేషన్‌లైజేషన్ చేసి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. జేసీని కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు ఎస్.రామారావు తొందరలు ఉన్నారు.

నల్లమందు పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై వి.ప్రసాదరావు



పట్టుబడిన నల్లమందు

రామభద్రపురం: మండలంలోని ముచ్చర్లవలస పరిధిలో గల పెట్రోల్ బంకు సమీపంలో రాజస్థాన్ డాబా వద్ద ఎస్సై వి. ప్రసాదరావు సిబ్బందితో కలిసి 7వ తేదీన నల్లమందును పట్టుకున్నారు. గతంలో మండల కేంద్రం పరిసర ప్రాంతాల్లో గంజాయి, గుట్కా, ఖైనీ వంటి మాదక ద్రవ్యాలు అక్రమరవాణా చేస్తూ పలువురు నిందితులు పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. కానీ ఇప్పుడు నలమందు కూడా సరఫరా చేస్తూ పట్టుబడడం ఆందోళనకు గురిచేస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రంలోని బర్మార్ జిల్లా మండలి మండలం,కోర్ణా గ్రామానికి చెందిన రాజేష్ చౌదరి అలియాస్ రాజేష్ ముచ్చర్లవలస సమీపంలో రాజస్థాన్ డాబా ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు.అలాగే రాజస్థాన్ నుంచి నల్లమందు తీసుకొచ్చి ఆ డాబాకు వచ్చిన లారీ డ్రైవర్లకు సరఫరా చేస్తున్నాడు. ఈ సమాచారం మేరకు ఎస్సై తన బృందంతో పాటు ఉపతహసీల్దార్ గిరిధర్‌తో కలిసి వెళ్లి నిందితుడిని పట్టుకుని 78 గ్రాముల నల్లమందు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సుమారు 8 నెలలుగా ప్రతి మూడు నెలలకోసారి రాజస్థాన్ వెళ్లి నల్లమందు తీసుకొచ్చి లారీ డ్రైవర్లకు సరఫరా చేస్తున్నాడు. నల్లమందుతో పట్టుబడిన నిందితుడిని అరెస్టు చేసి ఎస్సై వి.ప్రసాదరావు కేసునమోదు చేశారు. సీఐ నారాయణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని సాలూరు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

జీఎంఆర్ కేర్‌లో అరుదైన శస్త్రచికిత్స

- రోగి ప్రాణాలు కాపాడిన వైద్యులు



ఆపరేషన్ అనంతరం పేషెంట్‌తో వైద్యులు

రాజాం:

స్థానిక జీఎంఆర్ కేర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్సను వైద్యులు నిర్వహించి ఓ రోగి ప్రాణాలు కాపాడారు. ఈ మేరకు ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి ఎం.డి డాక్టర్ దామెర రాజేంద్ర వివరాలు వెల్లడించారు. రాజాం పట్టణంలోని వస్త్రపురికాలనీకి చెందిన నల్ల సత్యవతి అనే వృద్ధురాలికి వారం రోజుల క్రితం ఒక చెయ్యి, ఒక కాలు పనిచేయకపోవడంతో ఆస్పత్రిలో కుటుంబసభ్యులు చేర్చారు. ఎమర్జెన్సీ వార్డులో అత్యవసర చికిత్స అనంతరం స్కానింగ్ చేయగా ఆమెకు మెదడులో రక్తస్రావం జరుగుతున్నట్లు గమనించారు. ఈ సమయంలో ఆమెకు అత్యవసర ఆపరేషన్ అవసరం ఉందని న్యూరో సర్జన్ డాక్టర్ వినోద్ గుర్తించారు. దీంతో ఈ విషయం కుటుంబసభ్యులకు వివరించి, వారు అంగీకరించిన తరువాత ఎవేక్ క్రానియోటమీ(మెలకువలో ఉండగానే మెదడుకు చికిత్స) చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 4న ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు వినియోగించి ఎవేక్ క్రానియోటమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. తమ కుటుంబ పెద్ద ప్రాణాలు కాపాడిన కేర్ ఆస్పత్రి వైద్యులను సత్యవతి కుటుంబసభ్యులు అభినందించారు.

జూనియర్ అథ్లెటిక్స్ విజేతలను అభినందించిన జేసీ



క్రీడాకారులను అభినందిస్తున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం: ఈనెల 4,5,6 తేదీల్లో రాజమండ్రిలోని ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి 37 వ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మొత్తం 20 పతకాలను సాధించి తమ సత్తా చాటారు. ఈ పోటీల్లో 11 స్వర్ణ, 6 రజిత, 3 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆ విజేతలను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మంగళవారం తన చాంబర్‌లో అభినందించారు. క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తామని జేసీ ఈ సందర్భంగా అన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన 7 గురు క్రీడాకారులకు అన్ని విధాలా సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలి



ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేస్తున్న బుడితి అప్పలనాయుడు తదితరులు

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు

విజయనగరం ఫూల్‌బాగ్: పాలకులు మారుతున్న ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం మాత్రం ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్రలో ప్రాంతీయ సదస్సు, రాయలసీమలో ఒకచోట, కోస్తాంధ్రలో మరోచోట జరపాలని రాష్ట్ర సమితి నిర్ణయం మేరకు అక్టోబర్ 22 వ తేదీన ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సులో భవిష్యత్తు కార్యాచరణ కూడా రూపొందించుకోనున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక అమర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం ప్రాంతీయ సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగ రాజు, రైతు సంఘం నాయకుడు, పాల్గొన్నారు.

ముగిసిన ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

- 16 డిమాండ్ల సాధన ప్రతిపాదనలకు ఆమోదం



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

విజయనగరం అర్బన్: విజయనగరంలో మూడు రోజులుగా జరిగిన ఏపీటీఎఫ్ 80 వసంతాల మహాసభ బుధవారంతో ముగిసింది. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలతో కూడిన 16 డిమాండ్ల సాధన ప్రతిపాదనలను మహాసభ ఆమోదించింది. అధ్యక్షుడు జి.హృదయరాజు అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి విధాన పత్రాన్ని సభలో ప్రకటించి తీర్మానాలను ఆమోదింప చేశారు. తీర్మానాల్లో ప్రధానంగా ఏకీకృతరూల్స్ సమస్య పరిష్కరించాలని, సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని, ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియం, ప్రజల స్థానిక మాతృభాషలో విద్యా విధానం కొనసాగించాలని, జీఓ నంబర్ 170, 84, 85 జీఓలను రద్దు చేయాలని, తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సోషల్ పాఠ్య పుస్తకాలలో సిలబస్‌ను తగ్గించాలని పేర్కొన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం, ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఉన్న సౌకర్యాలు కల్పించాలని, కేజీబీవీలకు శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని, స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్ల ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలనే డిమాండ్లతో మహాసభ తీర్మానించింది. ఈ తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పిస్తామని రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, చీఫ్ ఫ్యాక్టరీ కె.సుబ్బారెడ్డి, ఉపాధ్యాయ ప్రకృతి పత్రిక సంపాదకుడు జి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు వై.సత్యం, డి.ఈశ్వరరావు, రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులు, 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన, రాష్ట్ర కౌన్సిలర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.